క్లుప్తంగా

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

తెనాలిటౌన్: తెనాలి డివిజన్ పరిధిలోని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో వినియోగదారుల సౌకర్యార్థం ఆదివారం కూడా విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు ఏర్పాట్లు చేశామని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీవీ చిరంజీవి శనివారం తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్, మొబైల్ యాప్ ద్వారా కూడా సులభంగా బిల్లులు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

నేడు తెలుగు మాధ్యమంపై సదస్సు

తెనాలి: జనసాహితీ మిత్రులతో ఆదివారం తెనాలిలో 'తెలుగు మాధ్యమం–ఎదుర్కొంటున్న సవాళ్లు'పై సదస్సు, పుస్తకావిష్కరణ జరగనున్నాయి. స్థానిక కొత్తపేటలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో సాయంత్రం 4 గంటలకు ఏర్పాటయే సదస్సుకు జనసాహితి అధ్యక్షుడు దివి కుమార్ అధ్యక్షత వహిస్తారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వరరావు 'పాలనలో మాతృభాష', అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్ 'మాతృభాషా మాధ్యమ ఆవశ్యకత'పై మాట్లాడతారు. 'మేధావుల పాత్ర'పై డాక్టర్ రావి రంగారావు మాట్లాడతారు. డాక్టర్ పిల్లి వాసు, చందు నాగేశ్వరరావు మాట్లాడతారు. చందు రచన 'అమ్మనుడి 'కందము–పంచశతి', జనసాహితి ప్రచురణ 'సృజనకు విత్తు–సొంత భాష' పుస్తకావిష్కరణ ఉంటాయి.

నేడు బీఎస్ఎన్ఎల్ బిల్లులు చెల్లించవచ్చు

తెనాలిరూరల్: బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఆదివారం తెరచి ఉంటుందని, వినియోగదారులు బిల్లులను చెల్లించవచ్చని టెలికం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కె.పద్మావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి నెలతో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున వినియోగదారుల సౌకర్యార్థం బీఎస్ఎన్ఎల్ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఏడుగురు విద్యార్థులు ఎంపిక

తెనాలిఅర్బన్: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఐతానగర్‌లోని ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్ విద్యార్థులు ఏడుగురు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రాజకిషోర్ తెలిపారు. ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి ప్రతి సంవత్సరం రూ.12 వేల స్కాలర్‌షిప్‌ను నాలుగు సంవత్సరాల పాటు కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను శనివారం పాఠశాల ఆవరణలో అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాయన్న, ప్రసాద్, సాయి, ఫరీద్, బాషా, ప్రకాశరావు, శర్మ, అస్మాతున్నీసా, బెల్లంకొండ వెంకట్, రత్నకుమారి, స్వర్ణమంజరి, ప్రసూనదేవి తదితరులు పాల్గొన్నారు.

క్షణికావేశంతో అనర్థాలు

తెనాలిరూరల్: క్షణికావేశంతోనే అనర్థాలు చోటుచేసుకుంటున్నాయని, నేరాలకు పాల్పడి జీవితాలను అంధకారం చేసుకుంటున్నారని రెండో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ జె.శ్రీసీత అన్నారు. తెనాలి సబ్‌జైలును శనివారం సాయంత్రం ఆమె సందర్శించారు. ఖైదీలకు ఇస్తున్న ఆహారాన్ని, జైలు ఆవరణను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. గతంలో చేసిన పొరపాట్లను ఇకపై చేయకుండా ఉండేలా జైలులోనే మంచి నడవడిక అలవర్చుకోవాలని సూచించారు. అవసరమైన వారికి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ సలహా అందిస్తామని చెప్పారు. న్యాయమూర్తి వెంట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాలరావు, ప్యానల్ న్యాయవాది అప్పాల కిషోర్, యర్రంశెట్టి అనిల్‌కుమార్, న్యాయశాఖ సిబ్బంది ఉన్నారు.

అసెంబ్లీ తీర్మానంపై హర్షం

తెనాలిఅర్బన్: దళిత క్రైస్తవులను ఎస్సీల్లో కలిపేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం అసెంబ్లీలో తీర్మానం చేసి ఆమోదించడం హర్షణీయమని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ కనపర్తి అబ్రహాం లింకన్ పేర్కొన్నారు. దళిత క్రైస్తవులు ఎన్నో సంవత్సరాల నుంచి ఎస్సీల్లో కలపాలని కోరుతూ వస్తున్నట్లు గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించి ఈ బిల్లును వెంటనే ఆమోదించాలని కోరారు. శాసన సభలో తీర్మానం చేసి ఆమోదించిన సీఎం జగన్‌కు, శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులకు ఆయన శనివారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

పెళ్లి పేరిట లైంగికదాడి

పోలీసులను ఆశ్రయించిన మహిళ

తెనాలిరూరల్: పెళ్లి పేరిట తనను పిలిపించి లైంగికదాడికి పాల్పడ్డాడని ఓ వ్యక్తిపై మహిళ ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తాడేపల్లిగూడేనికి చెందిన పద్మకుమారి భర్త నుంచి విడాకులు తీసుకుని ఒంటరిగా ఉంటోంది. రెండో వివాహం చేసుకోవడానికి సంబంధం చూడమని తనకు తెలిసిన రవిదేవరాజ్‌కు చెప్పగా అతను తెనాలి మోరిస్‌పేటకు చెందిన 66 ఏళ్ల భాస్కర్‌చౌదరిని పరిచయం చేశాడు. భాస్కర్‌చౌదరి పెళ్లి చేసుకుంటానని చెప్పి తెనాలికి పిలిపించి తనపై లైంగికదాడికి పాల్పడ్డాడని పద్మకుమారి శనివారం పోలీసులను ఆశ్రయించగా త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెనాలి స్టేషన్‌కు కొత్త సొబగులు

- శోభాయమానం కానున్న చారిత్రక తెనాలి రైల్వేజంక్షన్
- కొత్తగా ఒనగూరనున్న వసతులు



తెనాలి రైల్వే జంక్షన్

తెనాలి: కాలానుగుణంగా సరికొత్త హంగులు సమకూరుతున్న తెనాలి రైల్వేజంక్షన్‌కు మరిన్ని సొబగులు, సౌకర్యాలు అందనున్నాయి. 'అమృత్ భారత్ స్టేషన్స్' పథక కింద తెనాలి రైల్వేస్టేషనుకు అనేకమైన మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. ఇందుకోసం ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందించి, అవసరమైన బడ్జెట్‌ను కేటాయించి, అభివృద్ధి చేయనున్నారు. పలు వసతులు, ప్రత్యేకతలతో జాతీయస్థాయిలో అవార్డును కైవసం చేసుకున్న తెనాలి రైల్వేస్టేషను మరింత శోభాయమానం కాగలదని భావిస్తున్నారు.

చెన్నై మార్గంలో కీలక స్టేషన్

విజయవాడ–చెన్నై రైలుమార్గంలో కీలకమైన అయిదు రైల్వేస్టేషన్లలో తెనాలి జంక్షన్ ఒకటి. క్విట్ ఇండియా ఉద్యమంలో స్వాతంత్ర్యయోధులు స్టేషనును ధ్వంసం చేసి, రైలుబోగీలను దగ్ధంచేసిన వైనం చరిత్రకెక్కింది. దక్షిణమధ్య రైల్వే పరిధిలో గల ఈ జంక్షన్ నుంచి దేశ రాజధాని సహా అన్ని ప్రధాన నగరాలకు రాకపోకలకు అవకాశముంది. త్వరలో వందేభారత్ రైలు కూడా తెనాలి జంక్షను మీదుగా రాకపోకలు సాగించనుంది. ఈ తరుణంలో కేంద్రప్రభుత్వం ఇటీవలి బడ్జెట్‌లో 'అమృత్ భారత్ స్టేషన్స్' పథకాన్ని ప్రవేశపెట్టింది. దేశంలోని 1,275 రైల్వేస్టేషన్లను ఆధునికీకరించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. వీటిలో మన రాష్ట్రంలోని 72 రైల్వేస్టేషన్లు ఉండగా, అందులో జిల్లా కేంద్రమైన గుంటూరు స్టేషనుతోపాటు తెనాలి జంక్షను కూడా చేరటం విశేషం.

అందుబాటులోకి రానున్న ఆధునిక సౌకర్యాలు

ప్రతి రైల్వేస్టేషనులో భవనాలు, ఫ్లోరింగ్ ఆధునిక శైలిలో నిర్మిస్తారు. ప్రస్తుతం 600 మీటర్ల పొడవుతో ఉన్న ప్లాట్‌ఫామ్‌లను 760 మీటర్ల నుంచి 840 మీటర వరకు పొడిగిస్తారు. స్టేషన్ల వద్ద శుభ్రత, సులభమైన నిర్వహణకు 'బ్యాలస్ట్‌లెస్ ట్రాక్'లు ఏర్పాటు చేస్తారు. ప్రయాణీకుల తాకిడి ఎక్కువగా ఉంటే అందుకనుగుణంగా ఎస్కలేటర్లు తీసుకొస్తారు. దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా వీల్ చెయిర్లు, ప్రత్యేక ప్రవేశమార్గాలు, ఇతర సదుపాయాలు, వెయిటింగ్ హాల్స్...అనుబంధంగా కేఫెటేరియా. స్టేషను మొదటి అంతస్తులో ప్రత్యేకంగా రూఫ్ ప్లాజా, సమావేశ మందిరాలు, స్టేషనుకు రెండువైపులా అప్రోచ్‌రోడ్లు, పార్కింగ్ ఏరియా, పాదచారులకు ప్రత్యేక దారి, ల్యాండ్ స్కేపింగ్, ఆధునిక లైటింగ్, వేగవంతమైన వైఫై సేవలకు 5జీ టవర్లు వంటివి కొత్తగా వస్తాయి. తెనాలి రైల్వేస్టేషను కీలకమైన రైలుమార్గంలో ఉన్నందున దాదాపు అన్ని సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టు ఉంది. సగటున ప్రతి 15 నిముషాలకో రైలు ఇక్కడకు వస్తుంది. కరోనాకు ముందు ప్రతిరోజూ 11 వేల మంది ప్రయాణీకులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించేవారు. ప్రస్తుతం వీరిసంఖ్య ఎనిమిది వేలకు పైగా ఉంది. బుకింగ్‌లో ఇచ్చే టికెట్లు, రిజర్వేషన్లతో రోజుకు రూ.6–8 లక్షల ఆదాయం వస్తోంది.

ఇకపోతే ఇక్కడ్నుంచి మొక్కజొన్న సీజనులో ప్రత్యేక ర్యాక్‌లను రైల్వేశాఖ సమకూరుస్తోంది. వీటి ఆదాయం అదనం. 95 కిలోవాట్ల సోలార్ ప్యానెల్స్‌ను వినియోగిస్తూ ఏడాదికి 1.30 లక్షల యూనిట్ల విద్యుత్‌ను ఆదా చేస్తున్నందుకు తెనాలి స్టేషనుకు గత డిసెంబరులో 'జాతీయ ఇంధన పొదుపు మెరిట్ సర్టిఫికెట్' లభించింది.


రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫారం

దక్షిణం వైపు పూర్తయిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి

రైల్వేస్టేషనుకు గతంలో ఒక ప్రవేశద్వారం ఉండగా, ఇటీవల రీమోడల్‌తో రెండు మార్గాలను ఏర్పాటు చేశారు. ఒకటి, మూడు ప్లాట్‌ఫాంలలో ఎస్కలేటర్లు నడుస్తున్నాయి. లిఫ్టులు కూడా ఉన్నాయి. ప్రయాణీకుల విజ్ఞప్తితో స్టేషనులో దక్షిణం వైపున ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని ఈమధ్యనే నిర్మించారు. మళ్లీ ఇప్పుడు అమృత్ భారత్ స్టేషన్ల పథకంలో చేర్పటంతో మరెన్నో వసతులు సమకూరతాయని భావిస్తున్నారు.

డెయిరీలు పాలకు రూ.10 అదనంగా ఇవ్వాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్


మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ నాగిరెడ్డి

తెనాలి: డెయిరీలు రైతులకు లీటరు పాలకు అదనంగా రూ.10 చొప్పున ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం పట్టణ అయితానగర్‌లో జరిగిన పాల రైతుల సమావేశానికి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి అజయ్‌కుమార్ ప్రసంగిస్తూ పాడిపంట రెండూ సమపాళ్లలో అభివృద్ధి చెందినప్పుడే వ్యవసాయం, గ్రామీణ ప్రాంతాలు ప్రగతి బాటన నడుస్తాయన్నారు. పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ నాగిరెడ్డి మాట్లాడుతూ పాడిపశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గేదెలను రోజుకు రెండు గంటలు ఎండలో ఉంచి, కాల్షియం అందేలా చూసినట్టయితే గేదెలు ఆరోగ్యవంతంగా ఉంటూ అధిక పాల దిగుబడిని ఇస్తాయన్నారు. గేదెల సంతాన ఉత్పత్తికి ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన పథకాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. వేజెండ్ల తబిత, వేజెండ్ల రోశయ్య, మేకల చిట్టిబాబు, ముద్దన సాంబశివరావు, షేక్ హుస్సేన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్తు సాధ్యం

2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీసీత


విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని రుచి చూస్తున్న న్యాయమూర్తి శ్రీసీత

తెనాలి రూరల్: విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణతో విద్యనభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని 2వ అదనపు జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జె.శ్రీసీత విద్యార్థినులకు సూచించారు. స్థానిక మోరిస్‌పేటలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహాలు 1, 2, గిరిజన గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలను న్యాయమూర్తి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందుతున్న సదుపాయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనశాల, వాషింగ్ ఏరియాలను తనిఖీ చేశారు. వంటశాలను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని న్యాయమూర్తి స్వయంగా తిని పరిశీలించారు. వసతిగృహంలో మరుగుదొడ్లు, స్నానాల గదులకు తలుపులు లేకపోవడం గమనించి వాటిని త్వరితగతిన ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడుతూ, చెడు స్నేహాలకు ఆకర్షితులు కాకుండా విద్యపై దృష్టి పెట్టాలని చెప్పారు. లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలన్నారు. చట్టాలపై అవగాహన కలిగి సరైన మార్గంలో నడవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్ డబ్ల్యూఓలు రజని, అనురాధ, గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ తారామణి, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది మహబూబ్, యర్రంశెట్టి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి ముందుకు రాకుంటే పట్టా రద్దు

తెనాలిరూరల్: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఇళ్ల పట్టాలు పొందిన వారు ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రాకపోతే పట్టాలను రద్దు చేస్తామని తహసీల్దార్ కె.రవిబాబు హెచ్చరించారు. తెనాలి మండలం కొలకలూరు, అంగలకుదురు, పెదరావూరు, బుర్రిపాలెం గ్రామాల్లోని జగనన్న కాలనీలను శనివారం ఆయన సందర్శించారు. గ్రామ సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం అందించే సహాయంతో ఇల్లు నిర్మించుకోవచ్చని, డ్వాక్రా మహిళలకు అదనంగా రూ.35 వేల రుణం ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. మరో ఆప్షన్ కింద కాంట్రాక్టర్‌తో ఇంటి నిర్మాణం చేయించుకునే అవకాశం ఉందని చెప్పారు. పట్టా పొంది ఇంటి నిర్మాణానికి ముందుకు రాని వారి పట్టాను రద్దు చేసి వేరొకరికి మంజూరు చేస్తామన్నారు. పేదలకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. తహసీల్దార్ వెంట ఎంపీడీఓ ఎల్.విజయాలక్ష్మిణ్ ఉన్నారు.

దోమ తెరలు పంపిణీ



తెనాలి: రోటరీ క్లబ్, తెనాలి తరఫున స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా పూరిగుడిసెల్లో నివసిస్తున్న 30 నిరుపేద కుటుంబాలకు శనివారం దోమతెరలు పంపిణీ చేశారు. దోమల నుంచి రక్షణ కోసం ఈ సేవా కార్యక్రమం నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షుడు జెట్టి శివరామకృష్ణప్రసాద్ చెప్పారు. ఇంతకుముందు 40 మంది పేద మహిళలకు బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణనిప్పించినట్టు గుర్తుచేశారు. క్లబ్ కార్యదర్శి నితిన్ చాండ్నా, చేతన్‌రాజ్ కొఠారి, జీవీ నారాయణ, డి.మురళి, లెప్రా సొసైటీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ ఎం.రాధిక, ప్రాజెక్ట్ అసోసియేట్ ఏవీ భాసా, ఏఎంఒ వి.పున్నారెడ్డి, ఎస్‌వీఓ ఎస్.ఉమాకాంత్, ఎస్‌హెచ్ఐ టి.లక్ష్మీనరసయ్య పాల్గొన్నారు.

చిరుధాన్యాలను ఉపయోగించండి



తెనాలిఅర్బన్: చిరుధాన్యాలను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య సూచించారు. పాండురంగపేటలోని అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కఠెవరంలో పశువైద్య శిబిరం


శిబిరంలో పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మీనాక్షి

తెనాలిటౌన్: కొలకలూరు గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం (ఎన్ఎస్ఎస్) శనివారం మూడో రోజుకు చేరింది. శిబిరంలో భాగంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రొఫెసర్ ప్రసన్నకుమారి పర్యవేక్షణలో కఠెవరం గ్రామంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పశువైద్య శిబిరం గురించి రైతులకు తెలియజేశారు. వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న పాడి పరిశ్రమ ప్రయోజనాలను వివరించారు. శిబిరంలో 20 పశువులకు కొలకలూరు పశువైద్యశాల వైద్యురాలు మీనాక్షి సంచార పశువైద్య సేవ వైద్యురాలు కీర్తి, పూజిత వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రసన్నకుమారి, పశువైద్యశాల అసిస్టెంట్ నవీన, శ్యామ్, సిబ్బంది పాల్గొన్నారు. కొలకలూరు గ్రామంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు పలుచోట్ల బోర్డో మిశ్రమం, బోర్డో పేస్ట్ తయారీ గురించి, ప్రయోజనాలు గురించి రైతులకు తెలిపారు. అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చదువు వల్ల లాభాలు, ఉన్నత చదువుల గురించి అవగాహన కల్పించారు. సదస్సులో ఎంపీటీసీ సభ్యురాలు చక్కా సీతమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజనులకు మంచాలు పంపిణీ


మంచాలు పంపిణీ చేస్తున్న అంజలి

తెనాలిఅర్బన్: ట్రైబల్స్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత రావూరి అంజలి ఆధ్వర్యంలో కాలువ కట్టపై నివాసించే నిరుపేద గిరిజనులకు శనివారం మంచాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విషసర్పాల బారి నుంచి కాపాడాలనే ఉద్దేశంతో వీటిని పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ రావూరి సురేష్, సభ్యులు బొంత కృష్ణ, అద్దంకి పద్మ తదితరులు పాల్గొన్నారు.

సినీరంగ ధ్రువతార ఎన్టీఆర్

సినీ మాటల రచయిత సాయిమాధవ్


సినీ, టీవీ, రంగస్థల నటిమణి నాగమణికి ఎన్టీఆర్ పురస్కారాన్ని అందజేస్తున్న కమిటీ సభ్యులు

తెనాలిఅర్బన్: సినీ రంగ చరిత్రలో ఎన్టీఆర్ ఒక ధ్రువతారగా వెలుగొందారని ప్రముఖ సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్ పేర్కొన్నారు. ప్రముఖ సినీ నటుడు నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి తెనాలి కొత్తపేటలోని ఎన్జీవో కల్యాణ మండపంలో ఎన్టీఆర్ శతాబ్ది రంగస్థల పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ సాయిమాధవ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. అనంతరం రేపల్లెకు చెందిన ప్రముఖ సాహితీవేత్త, రంగస్థల నటుడు మన్నె శ్రీనివాసరావు, ప్రముఖ సినీ, టీవీ, రంగస్థల నటులు ఎ.నాగమణికి ఎన్టీఆర్ శతాబ్ది రంగస్థల పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో భీమవరపు సునీత, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, కేసన కోటేశ్వరరావు, చలసాని కృష్ణప్రసాద్, కేఎస్‌టీ సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆ గానం.. సమ్మోహనం


గానాలాపన చేస్తున్న అనిరుథ్

తెనాలి: పట్టణంలో బోసురోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలోని కళావేదికపై శనివారం సాయంత్రం చెన్నైకు చెందిన ప్రముఖ వర్ధమాన గాయకుడు అనిరుథ్ గానం సంగీతాభిమానులను సమ్మోహనపరిచింది. దాదాపు రెండు గంటల సేపు శాస్త్రీయ, సినీ గీతాలను జనరంజకంగా ఆలపించారు. కీబోర్డుపై జి.సాయి (గుంటూరు), తబలాపై పి.రమణ (గుంటూరు)వాద్య సహకారం అందించారు. రామలింగేశ్వర భక్త సమాజం, ఆంధ్రాప్యారిస్ అకాడమీ, తెనాలి సంయుక్త ఆధ్వర్యంలో ఈ భక్తిసంగీత విభావరిని నిర్వహించారు. పరుచూరు సుబ్బారావు, కొండపి వసుంధర, కొండపి శ్రీనివాసరావు, లక్కరాజు లక్ష్మణరావు, టీవీఎస్ శాస్త్రి, శంకర్‌రాజు, శ్రీనివాసరావు, పానుకుమాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. కానూరు వెంకట రామకృష్ణ పర్యవేక్షించారు.

ప్రజాస్వామ్య విలువలను దిగజారుస్తున్న మోదీ

- ఏపీసీసీ ప్రధానకార్యదర్శి చిలకా విజయ్‌కుమార్
- తాడికొండలో ప్రధాని దిష్టిబొమ్మ దహనం

తాడికొండ: ప్రధాని మోదీ దేశంలో రోజురోజుకీ ప్రజాస్వామ్య విలువలను దిగజారుస్తున్నాడని ఏపీసీసీ ప్రధానకార్యదర్శి చిలకా విజయ్‌కుమార్ అన్నారు. రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ తాడికొండ బస్టాండ్ సెంటర్‌లో శనివారం ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ న్యాయస్థానాలు, న్యాయమూర్తులు, న్యాయ వ్యవస్థలను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ తప్పు పట్టదని, అప్పీల్‌కు 30 రోజులు గడువు ఉన్నప్పటికీ అనర్హత వేటు వేయడం దారుణమన్నారు. బీజేపీకి పతనం తప్పదన్నారు. కార్యక్రమంలో తాడికొండ మండల అధ్యక్షులు షేక్ షరీఫ్, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ లియాఖత్, తుళ్లూరు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అడుసుమల్లి శ్రీనివాసరావు, మైనార్టీ నాయకులు షేక్ బాషా, షేక్ హుస్సేన్, మండల కార్యదర్శి మట్టుపల్లి అనీల్ కుమార్, పెదపరిమి గ్రామ అధ్యక్షులు షేక్ రఫీ, చిలకా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో చోరీలు

- సుమారు రూ. 5 లక్షల విలువైన బంగారం, వెండి అపహరణ
- ద్విచక్ర వాహనం మాయం


చిందర వందరగా పడి ఉన్న వస్తువులు

మంగళగిరి: నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పాత బస్టాండ్ సెంటర్ సమీపంలోని ఇస్లాంపేటకు చెందిన అబ్దుల్ మజీద్ ఇటీవల నూతన అంతస్తు నిర్మించుకున్నాడు. శుక్రవారం రాత్రి తన కుటుంబంతో కలసి నిద్రిస్తున్నారు. ఆ సమయంలో ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు మజీద్ కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న గది తలుపులకు గడియ పెట్టారు. కింది అంతస్తులోని తలుపుల తాళాలు పగులగొట్టి బీరువాలోని ఐదు కాసుల బంగారం, 20 తులాల వెండి పట్టీలు, మైకుతోపాటు రూ.5వేల నగదు అపహరించారు. నగరంలోని భాగవతుల వారి వీధిలో నివసిస్తున్న కుంచాల ప్రేమ్‌సాగర్ తన కుటుంబసభ్యులతో కలసి తిరుపతి వెళ్లారు. శనివారం తెల్లవారుజామున తిరిగి ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని 20 గ్రాముల బంగారం, అరకేజీ వెండి, మూడు వాచీలతోపాటు రూ.5వేల నగదును గుర్తు తెలియని దుండగులు తీసుకెళ్లారు. బాధితులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి దశలోనే సేవను అలవర్చుకోవాలి

దుగ్గిరాల తహసీల్దార్ కె.మల్లేశ్వరి

తాడేపల్లిరూరల్: విద్యార్థులు విద్యతోపాటు సేవను కూడా జీవితంలో అలవాటు చేసుకోవాలని దుగ్గిరాల తహసీల్దార్ కె.మల్లేశ్వరి అన్నారు. శనివారం కేఎల్ విశ్వవిద్యాలయంలోని ఎన్ఎస్ఎస్ యూనిట్–2 ఆధ్వర్యంలో దుగ్గిరాల మండలం పెదపాలెంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పోషకాహార లోపాలు లేకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని, విద్యార్థులు విద్యతోపా టు సామాజిక సేవ అలవర్చుకోవాలని అన్నారు. విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవడతాయని అన్నారు. వర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్, డాక్టర్ కేఆర్ఎస్. ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అబ్దుల్ బాసిత్, ఎస్.మానస పెదపాలెం గ్రామ సర్పంచ్ పాటిబండ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన ఖిద్మత్ సభ్యులు

నిరుపేద యువకుని మృతదేహానికి అంత్యక్రియలు

మంగళగిరి: నిరుపేద కుటుంబానికి చెందిన ఓ యువకుని మృతదేహానికి నగరానికి చెందిన ఖిద్మత్ టీమ్ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించి మానవతాన్ని చాటుకున్నారు. వివరాలలోకి వెళితే... నగర పరిధిలోని ఉడా కాలనీ బాపనయ్యనగర్ ఐదో లైనుకు చెందిన వలపర్ల నాగమల్లేశ్వరరావు (24) కొంతకాలంగా మానసిక సమస్యతో బాధపడుతున్నాడు. శనివారం నగరంలోని స్టేషన్ రోడ్‌లోని సులబ్ కాంప్లెక్స్ వద్ద మృతి చెందాడు. ఆటో డ్రైవర్లు నగరానికి చెందిన ఖిద్మత్ టీమ్ సభ్యులకు సమాచారాన్ని అందించారు. సంఘటనా ప్రాంతానికి చేరుకున్న ఖిద్మత్ టీమ్ సభ్యులు నాగమల్లేశ్వరరావు తల్లికి, సోదరుడికి సమాచారాన్ని అందించారు. మృతదేహం అంత్యక్రియల ఖర్చులకు తమ వద్ద డబ్బులు లేవని చెప్పడంతో స్పందించిన ఖిద్మత్ టీమ్ సభ్యులే మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు జరిపించారు.

న్యాయం చేయాలంటూ రాస్తారోకో


మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న మృతుడి బంధువులు

ఫిరంగిపురం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సాంబశివరావు కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు స్థానిక పోలీసుస్టేషన్ ఎదుట కర్నూలు–గుంటూరు రాష్ట్ర రహదారిపై మృతదేహంతో శనివారం సాయంత్రం రాస్తారోకో చేశారు. మండల కేంద్రంలోని పెట్రోలు బంకు సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డుప్రమాదంలో జి.సాంబశివరావు మృతిచెందిన విషయం విదితమే. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఆందోళన విషయం తెలుసుకున్న ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి తన సిబ్బందితో వచ్చి మృతుడి బంధువులతో మాట్లాడారు. మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానని చెప్పడంతో రాస్తారోకో విరమించారు. రాస్తారోకోతో భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.

